# ముసలం

"నువ్వేమీ కంగారుపడకు! నే చెబుతాగా?" అన్నాడు సీతప్ప అదిరిపోతూ.

ఆయన కళ్ళు పెద్దవిగా ఉన్నాయి. మొహాన చెమటలు దిగ్గారుతున్నాయి, మండువేసవిలోలాగా.

"ఏవిటండీ? ఏవయింది?" అన్నది రావమ్మ దడపుట్టుకొస్తూ.

"మరేంలేదు. అబ్బిని ఉద్యోగంలోంచి తీసేశారుట. ఇరవయ్యేళ్ళుగా అక్కడే ఉంటున్నట్టు సర్టిఫికేటు పుట్టించరా అని నేను వాడితో అప్పుడే చెప్పాను."

"ఎప్పుడు చెప్పారు? మీరనేది నాకేవీ బోధపట్టంలేదు. వాడి ఉద్యోగంపోతే కోడలూ పిల్లలూ ఏంగాను? హయ్యో, హయ్యో! నిక్షేపంలాంటి ఉద్యోగం! ఎందుకు పోయిందిటా."

"ఆంధ్రా విడిపోదామంటున్నారు కాదూ? అదేమంటారూ? ముల్కీ!" అన్నాడు సీతప్ప. పూనకంవచ్చినప్పుడు, సీతప్ప కిరసనాయిలు క్యూలాగా ఎంతైనా సాగిపోతాడుగాని, ఏవన్నా విచారించాలిసొస్తే అవతలి మనిషికి విషయం అంతుచిక్కేట్టు మాట్లాడలేదు.

"ఏవిటండీ మీరంటూంటారు? ములికేవిటి మధ్యని?"

ఒక్కమాట మీదనయితే సీతప్ప అనర్గళంగా లెక్చరియ్యగలడు – విషయం అరయితే మరి అడక్కండి.

"ఇప్పుడు నువ్వున్నావా? నువు నిజాం రాష్ట్రంలో పుట్టి పెరిగావంటే నువు ముల్కీ నీకక్కడ ఏ ఉద్యోగవడుగు, వెంఠనే ఇచ్చేస్తారు. నువు నిన్నో మొన్నో సికిందరాబాదో, హైదరాబాదో చేరి ఉద్యోగం అడిగావనుకో, లేదు పొమ్మనమంటారు. అది అక్కడి ఆనవాయితీ మరి!" అంటూ సీతప్ప ఫారంలోకి రాసాగాడు.

"మరి మన అబ్బికి సికింద్రాబాదు పోకుండానే ఉద్యోగవయింది కాదుటండీ?" అన్నది రావమ్మ, తన మొగుడు తప్పు వినుంటాడనుకుని.

"అందుకే ఇప్పుడీబెడదంతా వచ్చి పడింది. ఆ గాంధీ, నెహ్రూ ధర్మవా అంటూ – చచ్చి ఏ లోకానున్నారో! దేశం సొహంత్రం అయాక, మీ ముల్కీలూ, గిల్కీలూ చెల్లవుపొమ్మనటాంటూ ఎడా పెడా ఉద్యోగాలిచ్చేశారు. అక్కడ చదువుకున్న వాళ్లేలేరాయిరి. దేశవా ఎంతోపైకి రావాలిసుండె. అంచేతా, మనసత్యం లాంటి మెరికిలాంటి వాళ్ళను

పిలిపించి, మంచి ఉద్యోగాల్లో పెట్టేశారు. ఇదంతా చూసి నిజాం వాళ్ళకు కడుపుమండి 'ముల్కీ ఉండాలిసిందే!' అంటున్నారు. ఈ రంధి వెనకోసారి సాగిందే! ఇది అప్పట్లో సంక్షేపవయింది. అయితే ఇప్పుడు మన వాళ్లేమంటున్నారంటే, 'మేవేం తక్కువ తిన్నవాళ్ళవా ఏవిటి? మా ఆంధ్ర మాకు వేరే ఉండాలిసిందావటా'ని వీళ్ళు వుద్యమం సాగిస్తున్నారు. మరేం లేదుగాని, తెలంగాణా నుంచి వేలాది కుటుంబాలు పారిపోయొస్తున్నాయి. ప్రాణ భయం తప్ప విడిచి, మరోటీ, మరోటి కాదుగద! మన పొట్టి అయ్యంగారబ్బాయి - అబ్బితో పాటే పనిచేస్తున్నాడుగదూ మరీ? అలా కిరాణా కొట్టు దగ్గిర కనిపించి, మనవాడి ఉద్యోగం పోయిందావటాని చెప్పాడు."

"పాపం ఆ పిల్లాడి ఉద్యోగం కూడా పోయింది గావును!"

"అతనరవ్వాడు గాదామరి? అతని ఉద్యోగానికి ఏవీ ఢోకాలేదు. నువు అరవగాని, గుజరాతీగాని, హిందీగాని, పార్శీగాని, మరేదైనా గాని, గాక నీకు ముల్కీ ఆక్షేపణలేదు. ఆంధ్రుడివయావో? నడు బయిటికి! అయ్యంగారి చిన్నవాడు సెలవుమీదొచ్చాడు. అది నున్నూ, ఆ తెలంగాణావాళ్ళు గోడల మీద తెలుగు ఆడవాళ్ళను గురించి మరీ దారుణంగా, ఏకంగా బూతులే రాసేస్తున్నారుట. తెలుగు ఆడాళ్ళు తలాట్లోకి రావడానికి ధడుచుకు చస్తున్నార్ట!"

"మన కోడలుకు మహా సాహసం! అదుపులో ఉండే మనిషైనా కాదు. ఎన్నెన్ని పడరాని మాటలు పడుతున్నదో ఏమిటోమరి! అన్నట్టు ఇంత జరిగితే అబ్బిగాడు ఉత్తరం ముక్క రాశాడుకాడేం? వాణ్ణి అసలు సంగతి రాయమనీ, అది నిజవైతే వెంటనే సకుటుంబంగా వచ్చెయ్యమనీ ఒక్క ముక్క రాద్దురూ!" అన్నది రావమ్మ ఆందోళనపడిపోతూ.

"అవునన్నట్టు!" అంటూ సీతప్పలేచి అయిదు నిముషాలు చత్వారం జోడుకోసం వెతుక్కుని, మరో అయిదు నిమిషాలు తెల్లకాయితం కోసం వెతుక్కుని "శ్రీరామ సహాయం" అని రాశాడో లేదో పోస్టువాడి కేక వినిపించింది.

ఉత్తరం, సోమిదేవినుంచి కార్డుముక్కే. సత్యం పెళ్ళాం పిల్లలతోసహా రాజమండ్రి వచ్చాట్ట. వాడి ఉద్యోగం సొంతం ఊడిపోలేదుట. వాడి పై ఆఫీసరు వాణ్ణి నెల్రోజులు సెలవు పెట్టి ఊరి కెళ్ళిపొమ్మని సలహా ఇచ్చాట్ట. "ఆయన మా వారికి ఆప్త స్నేహితుడు గదా! అంచేత ఆపాటి సహాయం చెయ్యగలిగాడు" అని రాసింది సోమిదేవి. ఇంకా సీతారత్నం తల్లికి కాళ్ళవాపు అనీ, శీతాపతిగారికి జాండిస్ వచ్చి నయమయిందనీ, ఇలాటి సమాచారం కూడా రాసింది. తమ పిల్లలిద్దరూ బాగానే ఉన్నారనీ, చిన్న దానికి టీకాలు వేయించారనీ రాసింది.

"చూశారా, చూశారా? వాడు అక్కడ రైలెక్కి ఇక్కడ దిగొచ్చుగదా, రైళ్ళు మారి

రాజమండ్రీ పోతాడేవిటీ? తన ఉజ్జోగం విషయం ఒక్క కార్డు ముక్కయినా రాయకపోవడవేవిటీ? వాడు మనమీద ఇలా శీతకన్ను వేస్తాడనుకోలేదు సుమండీ!" అన్నది రావమ్మ.

"అదే పొరపాటు! తన ఉద్యోగం పోయిందని మనవనుకుని పోగలవనే వాడు ఉత్తరం ముక్క రాసుండడు. బోధపడిందిగదూ? మనమంటే హడలిపోయాంగాని, వాడికి ఉద్యోగం పోయిందన్న భయమేలేదనుకో. అవతల కొండంత బావగారు అండుండటవేవిటి – మనవాడి ఉద్యోగం పోవటవేవిటి? కల్లోకూడా అనుకోరాదంటేనూ. ఇహ, వాడు ఇక్కడికి తిన్నగా చక్కారాకుండానున్నూ అగచాట్లు పడి రైళ్ళు మారి రాజమండ్రికే ఎందుకు పోతాడూ అని గదా నీ ప్రశ్న? దానికీ, అబ్బో బోలెడంత కారణం ఉంది. హనుమంతుడేమిటోనున్నూ లంకలో వాలుతూనే రాక్షస సంహారవూ, లంకా దహనమూగట్రా చేసేముందు సీతమ్మవారికోసం వెతికిన తీరుగానే, మనవాడు ముందు తన బావగార్ని కలుసుకుని తన ఉద్యోగ పరిస్థితులన్నీ అరిటిపండొలిచినట్టు చెప్పాలిగదా? ఆ తరువాత కోడలు, ఎంతలేదన్నా పుట్టింటికి ఎప్పుడు చేరుదావా, తన వాళ్ళని ఎప్పుడు చూద్దావాని, ఆ పాండవులు అజ్ఞాత పరిసమాప్తి కోసం ఎదురుచూసిన విధంగా, ఎదురుచూస్తుంటుంది తప్ప విడిచి మరొహటి కాదుగదా? ఆ శీతాపతీ, మన వియ్యపురాలూ బొత్తిగా చాయిలా మనుషులై పోయారాయిరి. వాళ్ళకి మూడోతరం వాళ్ళని చూడాలని తహతహ ఉండదూ, మనం సోమిదేవి పిల్లలకోసం ఎలా బెంగెట్టుకున్నావో చూస్తూనే ఉన్నావుగదటే పిచ్చిదానా? చూస్తూ ఉండు, మనవాడు రాజమండ్రీ నుంచి అన్ని విషయాలూ రాయనే రాస్తాడు" అని సీతప్ప తన కొడుకును పూరాగా సమర్థించేశాడు.

సీతప్ప జోస్యం తప్పుకాలేదు. సత్యం రాజమండ్రి నుంచి ఉత్తరం రాశాడు కాని అందులో సీతప్ప అనుకున్న వార్తలేవీ లేవు. ఆంధ్ర ఉద్యమం గురించి ఉన్నది.

"అక్కడ మీకు వార్తలు అందుతున్నాయో లేదో తెలీదు. ఇక్కడా, ఇంకా అనేక ఊళ్ళలోనూ మహాబీభత్సంగా ఉంటున్నది. సి.ఆర్.పి. వాళ్ళు అంతటా ఆక్రమించుకు కూర్చున్నారు. మరి పేదజనం దుర్భరంగా జీవిస్తున్నారు. అందరికీ కష్టంగానే ఉన్నది. ఉద్యమంవాళ్ళు కూడా తక్కువ తినలేదు. వాళ్ళు కనిపించిన వాడినల్లా పళ్ళూడ గొట్టి డబ్బు వసూలు చేస్తున్నారు. వాళ్ళు ఎప్పుడు ఎలా నాయకులయారో తెలీదు. డబ్బు వసూలు చేసేవాళ్ళలో ఇద్దరు పచ్చి తాగుబోతులూ, వ్యభిచారులూ అని, వాళ్ళు వసూలు చేసేదంతా వాళ్ళ సొంతానికే అనీ చెప్పుకుంటున్నారు. ఊరేగింపులో చేరటానికీ, అరవటానికీ, తలలు పగలగొట్టించుకోవటానికీ మామూలు జనంకూడా వెనకాడకుండా వచ్చేస్తున్నారు. ఇదంతా కాంగ్రెసువాళ్ళ మధ్య తగాదా తప్ప ఇంకేమీ లేదని కొందరూ,

భూస్వాములు నడిపే ఉద్యమమనీ కొందరూ, ఇది సరయిన కమ్యూనిస్టుల చేతిలో పడితే మహారంజుగా ఉంటుందని కొందరూ అంటున్నారు. నన్ను బావగారు మరో చోటికి బదిలీ చేయించటానికి చూస్తున్నారు...."

ఇలా సాగింది ఉత్తరం.

ఆంధ్ర, తెలంగాణాల వేర్పాటు గురించి అది మంచిదా, చెడ్డదా, సబబా కాదా, ఎటూ తేల్చుకోలేకపోయాడు. ఆయనకు ఇలాటి క్లిష్ట పరిస్థితులు సాధారణంగా ఏర్పడవు. ఇది క్లిష్టవూ, క్లిష్టవున్నరా అయికూర్చున్నది. తాను చేసే నిర్ణయం అబ్బిగాడి భవిష్యత్తుకు ఏమాత్రమూ అభ్యంతరకరంగా ఉండకూడదు. అందులో రాజకీయంగా పప్పులో కాలు వెయ్యటంగాని, తన పేరు ప్రఖ్యాతులకు భంగం తెచ్చుకోవటంగాని జరక్కూడదు. 'ఓహో, సీతప్ప మా బాగా చెప్పాడు' అవటాన నలుగురూ అనుకునేటట్లుగానున్నూ ఉండాలి.

అటు చూడబోతేనేమో ఇందిరాగాంధీ ససేమిరా, విభజనవల్లగా దవటాంటున్నది. ఇటు చూడబోతే సర్కారాంధ్రులు యావన్మందీనున్నూ, మేం ప్రత్యేకాంధ్రకోసం చావనైనా చస్తావనటాని ఘోర ప్రమాణం చేశారు. అదీగాక తెలంగాణా కోసం తాను ఏమని కోరుకుంటాడూ? ఆ తెలంగాణా వాళ్ళేకదూ అబ్బిగాడికి ఉద్యోగం పోయినంతపని చేసి, తన కోడల్ని నానా అవాచ్యాలూ అన్నారు. కనీసం అని ఉంటారు. అలాగని వేర్పాటు జరగవలిసిందేనని అందావా అంటే ఇందిరాగాంధీ ఏ మాత్రమూనున్నూ లొంగివచ్చే లక్షణాలు కనిపించటంలేదు. ఇంకా లొంగి వచ్చేదేవిటి? రిజర్వు పోలీసుల్ని పంపి మారణ హోమవే చేయించేస్తున్నదాయిరి! ఆ శ్రీరామచంద్రమూర్తి వారు తనకు ఇంత ఘోర పరీక్ష ఎందుకు పెడుతున్నారో సీతప్పకు బోధపడలేదు.

దేన్ని గురించయినా ఒక నిర్ణయానికి రాలేనప్పుడు సీతప్ప మహా ఆరాటపడిపోతాడు. తాను నిర్ణయానికి వచ్చిన మరుక్షణం ఆ సమస్య పరిష్కారవైపోయినట్టు సీతప్ప ఉద్దేశం. మాటవరసకి ఈ క్షణంలో సీతప్ప విభజన జరగవలసిందనో, అలా ఎంత మాత్రమూ జరగకూడదనో అది తేల్చుకున్నాడంటే మరుక్షణం సమస్యే లేదు. ఇందిరాగాంధీ నిశ్చింతగా మరో రెడ్డిగాని నిశ్చింతగా నిద్రపోవచ్చు, జనం ఊరేగింపులు పోవచ్చు. పోలీసువాళ్ళ తలలు పగలగొట్టొచ్చు. ఏమైనాకావచ్చు కాని సమస్య ఉందన్న బాధ మాత్రం లేదు. సీతప్ప అనుభవంలో అన్ని సమస్యలూ వాటికవే పరిష్కారమైపోతాయి. ఒక్కలా వాటిని గురించి మనుషులు తేల్చుకోలేకపోవటం తప్ప మరేవీలేదు.

"అక్కడి రాజకార్యాలన్నీ ముగించి అబ్బినీ, కోడల్నీ, పిల్లల్నీ ఇక్కడికి రమ్మని రాశారుగదా?" అన్నది రావమ్మ.

సీతప్ప గతుక్కుమని "రాసా–ఉహు, ఇంకా రాయలేదు. ఎందుకూ? ఇవాళో రేపో వాడే రాస్తాడు వచ్చేస్తున్నా"వటని అన్నాడు.

"మరేం లేదు. మనవరాలిని, మనమణ్ణి చూడాలని ప్రాణం కొట్టుకుపోతున్నది" అన్నది రావమ్మ.

"అలాగేనూ! కాదూ మరి. మరొకటీ, మరొకటా? అదెప్పుడూ అంతేననుకో" అంటూ సీతప్ప అయోమయంలో పడ్డాడు.

"పిల్లవాడు ముమ్మూర్తులా మీరేనటా?" అన్నది రావమ్మ.

"తప్పుతుందా ఏం. నేను అచ్చు మా తాతేననేవారు. ఆయనకు కించిత్తు మెల్లవుండేది. నాకు బాగా గ్యాపకం! ఆయన పోయేటప్పటికే మోనున్నూ, నాకు పూర్తిగా పదే నిండిందిట."

సీతప్ప కొడుక్కి రమ్మని ఉత్తరం రాయనేలేదు. ఏ కారణంచేతనైనా గానీ, రావటానికి పడకపోతే వాడు పితృవాక్య పరిపాలన చెయ్యనివాడవుతాడేమో? అదివరకులా వాడిప్పుడు కాకిచేత కబురుచేస్తే వచ్చి వాలే స్థితి లేదాయిరి. అదీకాక తన ఉత్తరం సంగతి తెలిసి అవతల అల్లుడూ, వియ్యంకుడూ కూడానున్నూ 'అయ్ సీతప్ప ఎంత దుర్మార్గుడు! దూరాభారం నుంచి రాకరాకొచ్చిన సత్యాన్ని నాలుగురోజులైనా ఉండనియ్యకుండా వచ్చేమంటున్నాడు! అతను తిన్నగా అక్కడికే పొయ్యుంటే అది వేరే విషయం. బుద్ధిపూర్వకంగా, స్వయానా ఇక్కడికొచ్చేశాడు...' ఇలా అనుకుని పోగ్రు! సత్యం తనంతటే తను 'ఇక్కడ ఇన్నాళ్ళాయి ఉన్నానుగదా. ఇంక నేను మా అమ్మనూ, నాన్ననూ చూసి తీరాలి!' అన్నట్టాయెనా, వాళ్ళు మరి మాట్టాడ్రు. వాడు అలా అంటాడు కూడానూ. ఎందుకనడూ? కన్న తీపా, మరోటా?

అలా సీతప్ప కారణాల గుట్టపేర్చి సత్యానికి రమ్మని రాయటం ఎగ్గొట్టేశాడు. రావమ్మ శేషపిన్నితో మొరబెట్టుకుంది. శేష పిన్ని ఖరారు మనిషి. ఆవిడకు శష భిషలు గిట్టవు. తన మనవడిచేత ఒక కార్డు తెప్పించి, దానిమీద రావమ్మ చెప్పినట్టు రాసి, సత్యం ఎడ్రసుకు పోస్టులో పడేయించింది.

కార్డు అందిన పదోరోజున సత్యం భార్యా పిల్లలతో దిగాడు. పెద్ద పిల్ల ఇప్పటికే పేరేమిటంటే "అవా" అంటున్నది. "అలా అవ్వా అనకూడదే, తల్లీ" అన్నది వాళ్ళమ్మ.

"నీకేం తెలీదుపో! అవ్వ కాదు, ఆవా! నేను తారనైపోతా! అప్పుడు నువు అంజలీదేవి వేషం వేద్దూగాని! ఏం?" అన్నది సత్యం కూతురు.

రెండో వాడు – వాడి పేరు వెంకట సీతా రామ వరప్రసాద్ –"హె! హె. అంజలీదేవి!" అంటూ ఎగతాళారంభించాడు. ఇద్దరు పిల్లలూ కలిసి రావమ్మకు అంజలీదేవి అని పేరు పెట్టారు. ఎప్పుడో అంజలీదేవిని "గొల్లభామ"లో చూపిన రావమ్మ లోలోపల చాలా సంతోషించింది.

వాళ్ళు సీతప్పను "పిచ్చితాతయ్య" అని పిలవసాగారు. వాళ్ళ మేనమామ నరుసు వాళ్ళకు ఆ మాట బాగా మప్పాడు. ఆ సంగతి సీతప్ప ఎరగడు. ఎరిగినా ఆయన చెయ్యగలది ఏమీలేదు.

"మీ మావగారూ, అత్తగారూ బాగున్నారా? మీ బావమరిది నీతో సరిగా ఉంటున్నాడా?" అని రావమ్మ కొడుకును అడిగింది.

"వాడు నాతో సరిగా ఉండటమేమిటి? నేనే, పోనీ పాపంగదా అని, వాణ్ణీ ఒక మనిషల్లే చూస్తున్నాను. పుస్తకాలు మూలబడ్డాయి. ప్రెస్సు నడుపుకు బతుకుతున్నాడు" అన్నాడు సత్యం ఈసడింపుగా.

"నాన్నా, నన్ను శ్రీకాకుళం బదిలీ చెయ్యటానికి బావగారు ఆలోచిస్తున్నారు" అని సత్యం చెబితే సీతప్పకు ఒళ్ళు పొంగిపోయింది.

"అది ఫస్టురా, సత్యం! వాళ్ళని చెప్పుచ్చుకొట్టినట్టవుతుంది."

సత్యం నవ్వి, "ఎవళ్ళను, నాన్నా?" అని అడిగాడు.

ఎవళ్ళనో సీతప్పకు మాత్రం ఏం తెలుసూ? తీవ్రంగా ఆలోచించిన మీదట తెలంగాణా వాళ్ళు మనో నేత్రం ముందు మెదిలారు!

"ఆ తెలంగాణా వాళ్ళేకాదూ, మనకష్టాలన్నిటికీ కారణం?" అన్నాడు సీతప్ప.

"ఏం చెబుతాం? వాళ్ళ కష్టాలకన్నిటికి కారణం మనవేనంటున్నారు వాళ్ళు!"

"ఏవైనాగానీ, నువ్వింక ఆ ప్రాంతంలో ఉండేవద్దు. భద్రాచలం చెప్పినట్టు శ్రీకాకుళం వెళ్ళిపో. అంథే! అక్కడ నీకు ఈ పేచీలూ ఉండవు. జీవితం హాయిగా, ప్రశాంతంగా ఉండిపోతుంది. ఈ ఆంధ్రగొడవలూ అవీ ఉండవు. నా మాటవిని నీవు శ్రీకాకుళం వెళ్ళటానికి ఒప్పేసుకో!" అన్నాడు సీతప్ప.

***ముద్రణ: ఆంధ్రజ్యోతి వారపత్రిక, దీపావళి సంచిక, నవంబర్ 1975***

*(కాత్యాయని విద్మహే ప్రకారం 1972)*